# హైదరాబాద్ వార్త



## చేతులు కలిసినా ..మనసులు కలవట్లే ..!

**-పాత-కొత్త నేతల మధ్య కుదరని సయోధ్య**
**-గ్రేటర్ కాంగ్రెస్‌లో అంతర్గతంగా లుకలుకలు**
**-వలస నేతలతో కలిసిరాని కార్యకర్తలు**



**హైదరాబాద్,మే 2,ప్రభాతవార్త:**
గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లో ఘోర పరాభవం మూటగ్గట్టుకున్న హస్తం పార్టీ ..ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా ఎంపి ఎన్నికల్లో బలపడాలని భావిస్తుంది. అందుకు తగ్గట్టుగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, బడానేతలకు వల విసిరింది. ఈదిశగా చేరికల పర్యాన్ని కొనసాగిస్తుంది. ఇప్పుడు ఇదే ఆపార్టీకి కష్టాలను తెచ్చిపెడుతుంది. అధికారంలోకి రాగానే వలసను ప్రోత్సహించడంతో పార్టీని నమ్ముకున్న కేడర్‌ను అసంతృప్తికి గురిచేస్తుంది. కష్టకాలంలో వెన్నంటే ఉన్న తమకు కాదని ప్రత్యర్థి పార్టీల నాయకులును చేర్చుకోవడం వారిని నైరాశ్యంలోకి నెట్టింది. మొన్నటివరకు ప్రత్యర్థులుగా పోరాడిన తమను జంప్ జిలానీలతో కలిసి నడవాలని అధిష్టానం అదేశించినప్పటికీ పాత,కొత్త నాయకుల మధ్య సమన్వయలోపం లోక్‌సభ ఎన్నికల ప్రచారం తీవ్రంగా చూపుతుంది. మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం పరిధిలోని ఉప్పల్‌లో పాత కొత్త నేతల మధ్య వర్గపోరు కొనసాగుతుంది. మల్కాజ్‌గిరి టికెట్‌ను మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆశించి హస్తం పార్టీలో చేరారు. తీరా ఆయనకు కాకుండా స్థానికేతరులకు టికెట్ కేటాయించడంతో ఆయన వర్గం స్తబ్దుగా ఉండిపోయింది. అలాగే మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం పరిధిలోని కంటోన్మెంట్‌లోనూ అసమ్మతి రాజుకుంది. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో బిజెపి తరపున పోటీ చేసిన శ్రీగణేష్ అనూహ్యంగా కాంగ్రెస్‌కు చేరడం టికెట్ దక్కించుకోవడం స్థానిక నేతలకు మింగుడు పడటం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎపోటటీ చేసి ఓడిపోయిన గద్దర్ కూతురు వెన్నెల వర్గం తాజా పరిణామాలను జీర్ణించుకోలేకపోతుంది.అలాగే కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ బిజెపిని వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన చేరికను పలువురు సీనియర్ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. దీంతో నేతల మధ్య నెలకొన్ని అంతర్గత పోరు ఎన్నికల ప్రచారం పై ప్రభావం చూపనుంది. అలాగే మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నీ తానై వ్యవహరిస్తున్నప్పటికీ ..లోక్‌సభ టికెట్ ఆశించి భంగపడటంతో ఆయన కేడర్ నిరాశతో ఉంది. కూకట్‌పల్లిలో బండి రమేష్ ,సత్యం శ్రీరంగంల మధ్య వర్గపోరు కొనసాగుతుంది.

### సికింద్రాబాద్‌లో ...

సికింద్రాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ నుంచి దానం నాగేందర్ అభ్యర్థిత్వాన్ని పోటీ చేసినప్పటి నుంచి అక్కడ అంతర్గత పోరు నడుస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్‌పై ఓడిపోయిన పిజెఆర్ కూతురు విజయారెడ్డి వర్గం ప్రచారంలో పాల్గొనకుండా మౌనంగా ఉండిపోయింది. ఇటీవల జరిగిన ప్రచార కార్యక్రమంలో దానం పేరు ఎత్తకుండా విజయారెడ్డి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది.

**చేవెళ్లలో :** చేవెళ్లలోక్‌సభ స్థానం పరిధిలోనూ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుంది. ఈస్థానం నుంచి టికెట్ అశించి భంగపడ్డ జిల్లా పరిషత్ చైర్మన్ పట్నం సునీతారెడ్డి వర్గం రంజిత్ ప్రచార కార్యక్రమాలకు దూరం పాటిస్తుంది. అలాగే మాజీ ఎమ్మెల్యే తీగల, జడ్పీచైర్మన్ అనితవర్గంతో కలిసి పోవడానికి సీనియర్లు అంతగా ఆసక్తి చూపడం లేదు. రాజేంద్రనగర్‌లోనూ రెండుడ వర్గాల మధ్య అంతర్గత పోరు కొనసాగుతుంది. మొన్నటి వరకు ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన నరేందర్‌ను కాదని జ్ఞానేశ్వర్‌కు పెద్దపీట వెయడం పార్టీలో అసంతృప్తికి తావిచ్చింది.





## ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో ప్రేక్షకుల సందడి





**ఉప్పల్, మే 2 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న సన్‌రైజర్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరుగుతున్న ఐపిఎల్ ట్వంటీ మ్యాచ్‌లో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రేక్షకులు తరలివచ్చారు. సాయంత్రం ఆరు గంటల నుంచే స్టేడియం వద్ద సందడి వాతావరణం నెలకొంది. పాసులు ఉన్న పలువురు ప్రేక్షకులకు రెండు గంటల ముందే స్టేడియం వద్దకు తరలివచ్చారు. స్టేడియంకు వెళ్లే అన్ని రహదారుల వద్ద రద్దీ నెలకొంది. ఇదిలా ఉండగా స్టేడియం స్టాండ్స్ వద్ద విద్యుత్ సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్నారు.కార్పొరేట్ బాక్స్ లలో గంట నుంచి విద్యుత్ నిలిపిఎ శారు. దీంతో ప్రేక్షకులకు అవస్థలు పడ్డారు. మ్యాచ్ చూద్దామని ఎంతో ఆశతో వచ్చిన ప్రేక్షకులకు విద్యుత్ సమస్య తీవ్ర ఇబ్బందికి గురిచేసింది. ఉప్పల్ స్టేడియంలో విద్యుత్ సరఫరా సరిగ్గా లేకపోవడంపై హెచ్‌సిఏ వర్గాలను ఆరా తీయగా దీనిపై స్పందించలేదు. మ్యాచ్ జరిగిన ప్రతిసారి ఉప్పల్ పరిసర ప్రాంత వాసులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

## అల్లంత లోతున భూగర్భ జలాలు..

**హైదరాబాద్, మే 2, ప్రభాతవార్త**
పాతాళంలోకి గంగ జారిపోతోంది. సెగలు కక్కుతున్న భానుడి భగభగలతో కరిగి పోతోంది. వరుణుడి కరుణతో పదేళ్ళుగా కళకళలాడిన జలాశయాలు వేసవి రాకతో ఎండిపోగా.. బోరు బావులు బోరుమంటున్నాయి. మహానగర పరిధిలో మునుపెన్నడూలేని రీతిలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. గోదావరి, కృష్ణా జలాలతో తాగునీటి అవసరాలకు పెద్దగా ఇబ్బంది లేకున్నా.. ఇతర అవసరాలకు వినియోగించే నీరు అందుబాటులో లేక సీటీజనులు లబోదిబోమంటున్నారు. గత మూడు నెలల్లో సుమారు 31 ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు వట్టిపోయినట్లు అధికార నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గతేడాదితో పోల్చితే సగటున రెండు నుంచి ఏడు మీటర్ల మేర భూగర్భజలమట్టం తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. కూకట్‌పల్లిలో 15.84 నుంచి 22.74 మీటర్లకు అబ్దుల్లాపూర్‌మెట్‌లో 11 నుంచి 17.9 మీటర్ల లోతుకు తగ్గిపోయాయి.

**బోర్లపై ఆధారం..**

జలమండలి దినసరి 2602.29 ఎంఎల్‌డీ నీటి సరఫరా చేస్తున్నా.. ఇతర అవసరాల కోసం బోరు నీరే ఆధారం. నగరంలో రోజు విడిచి రోజు, శివార్లలో మూడు రోజులకు ఒకసారి నల్లా నీటి విడుదలతో ఇతర అవసరాల కోసం బోర్లపైనే ఆధారపడక తప్పని పరిస్థితి నెలకొంది. మరోవైపు నగర శివార్లలో గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల భవంతులు నిర్మాణాలు ఊపందుకోవడం, కాంక్రీట్ మహారణ్యాలు విస్తరిస్తున్న కారణంగా భూగర్భజలాల వినియోగం బాగా పెరిగింది. ఆ ప్రాంతాలకు సరైన పైపుల నీటి నెట్‌వర్క్ లేకపోవడం వల్ల బోర్ల తవ్వకాలు అధికమయ్యాయి. అది కూడా అత్యంత లోతుకు వేయడం పరిసర ప్రాంతాల భూగర్భ జలాలపై ప్రభావం చూపుతున్నాయి. గ్రేటర్ మొత్తం మీద 30 లక్షలకుపైగా బోర్లు ఉండగా అందులో ఇప్పటికే 30శాతం పైగా బోర్లల్లో భూగర్భ జలాలు అడుగంటి చుక్క నీరుపైకి రాని పరిస్థితి ఏర్పడింది. మిగతా 20శాతం బోర్ల పరిస్థితి అంతంత మాత్రంగా తయారైంది. పెద్ద బహుళ అంతస్తు భవనాలు, గ్రేటర్ కమ్యూనిటీల్లో మాత్రం బోర్లు పూర్తిగా వట్టిపోయాయి. గత మూడు నెలల్లో మణికొండ, గచ్చిబౌలి, కొండాపూర్, మాధాపూర్, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, బంజారా హిల్స్, అంబర్‌పేట, గోల్నాక, బోడుప్పల్‌లో బోర్లు దాదాపు ఎండి పోవడంతో జలమండలి, ప్రైవేటు ట్యాంకులకు డిమాండ్ బాగా పెరిగింది.



బోడుప్పల్‌లో బోరు వేయిస్తున్న చుక్క నీరు రాని దృశ్యం.

**ఇంకుడు గుంతల లేకనే..**

నగరంలో ఏటా కురుస్తున్న వర్షపాతం నేలగర్భంలోకి ఇంకేందుకు అవసరమైన ఇంకుడుగుంతలు లేక రహదారులపై నీరు ప్రవహించి చిట్టచివరికి మూసీలో కలవడం సర్వసాధారణంగా మారింది. దీంతో నగరంలో ఏటేటా భూగర్భజలం మట్టాలు పాతాళంలోకి పడిపోతున్నాయి. గ్రేటర్ పరిధిలో గృహాల సంఖ్య 40లక్షలకుపై ఉండగా ఇంకుడు గుంతల సంఖ్య ఐదు లక్షలకు మించిలేవు. మరోవైపు రోజువారిగా ఆయ బోరుబావుల నుంచి సుమారు 750కోట్ల లీటర్ల మేర భూగర్భ జలాలు తోడుతున్నట్లు అంచనా. ట్యాంకర్లు వినియోగిస్తున్న వారు భూగర్భ స్థాయి నీటి మట్టాల్ని పెంచేందుకు జలమండలి చర్యలు చేపట్టింది. ట్యాంకర్ ద్వారా వాటర్‌బుక్ చేసుకుంటున్న వినియోగదారులకు ఒక వైపు నీరు సరఫరా చేస్తూనే.. మరో వైపు ఇళ్లల్లో ఇంకుడు గుంతల నిర్మాణం ఏర్పాటు చేసేందుకు చొరవ తీసుకునేలా అవగాహన కల్పించేందుకు సిద్ధమైంది.

**శివార్లలో ఇలా..**

నగర శివార్లలో గతేడాదితో పోలిస్తే దాదాపు 3 మీటర్ల మేర భూగర్భ జలనీటిమట్టం తగ్గింది. ఈ సారి పాతాళగంగ లోతుకు పడిపోవటంతో నీటి సమస్య తీవ్ర రూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లాలో సగటున నాలుగు మీటర్లు, మేడ్చల్ జిల్లా పరిధిలో సగటున మూడు మీటర్లు, హైదరాబాద్ పరిధిలో సగటున 2.5మీటర్ల భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయి.

## రూ.2.30 లక్షల నగదు స్వాధీనం



రూ.2.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు

**కంటోన్మెంట్,మే 2 ప్రభాతార్త:** లోక్ సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గురువారం సాయంత్రం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి నుంచి రూ.2.30 లక్షల నగదును సికింద్రాబాద్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం సాయంత్రం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జి.ఆర్.పి, ఆర్.పి.ఎఫ్‌ల ఆధ్వర యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా మల్కాజిగిరికి చెందిన సీతారామారావు అనే వ్యక్తి నుంచి 2వ ఫ్లాట్ ఫారం వద్ద అనుమానస్పదంగా తనిఖీ చేయగా రూ.2.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదును హైదరాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేస్తామని రైల్వే పోలీసులు తెలిపారు.

## పార్లమెంట్ ఎన్నికలకు సజావుగా జరిగేందుకు సర్వం సిద్ధం

**-జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్**

**హైదరాబాద్,మే 2,ప్రభాతవార్త:**
జిల్లాలో పార్లమెంట్ఎన్నికలకు సజావుగా ,ప్రశాంతంగా జరిగేందుకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. భారత ఎన్నికల కమిషన్‌కు చెందిన సీనియర్ డిప్యూటీ సిఈవో నితీష్ వ్యాస్ న్యూఢిల్లీ నుంచి రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల జనరల్, పోలీస్ వ్యయ పరిశీలకులు రిటర్నింగ్ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈసందర్భంగా రోనాల్డ్‌రోస్ మాట్లాడుతూ ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్‌లు ప్రతి ఇంటికి వెళ్ళి పంపిణీ చేస్తున్నట్లు ,హోం ఓటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎండ తీవ్రత గురికాకుండా షామియానా (టెంట్) త్రాగునీరు, లైటింగ్, ఫ్యాన్స్ పోలింగ్ అసెస్టెంట్ బూత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సిపి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సెక్యూరిటీ ప్లాన్ పోలింగ్ స్టేషన్‌లో బందోబస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా హైదరాబాద్ సికింద్రాబాద్ ఎన్నికల పరిశీలకులు , ఎన్నికల నియమావళి అనుసరించి అన్నిచర్యలు తీసుకోనున్నట్లు ,ఎస్ఎస్‌టి బృందాలు తనిఖీలు పెద్దఎత్తున చేపట్టినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సికింద్రాబాద్ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు డాక్టర్ సరోజ్‌కుమార్, శ్రీవిద్య, పోలీస్ పరిశీలకులు శశాంత్ ఆనంద్, వ్యయ పరిశీలకులు అమిత్‌శుక్లా, సెంతిల్‌కుమార్, మధుకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత పదార్థాలు స్వాధీనం

**మైలార్‌దేవ్‌పల్లి,మే 2 ప్రభాతవార్త :**
మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదన్ బాబుల్‌రెడ్డి నగర్‌లో గుట్కా తయారు చేస్తున్న ఫ్యాక్టరీపై శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు దాడు జరిపి దాదాపు కోటీ డబ్బై మూడు లక్షల రూపాయల విలువ చేసే నల్ల మందును స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ వెల్లడించారు.రాజస్థాన్ రాష్ట్రం,భామ జిల్లా,నింభాలి ప్రాంతానికి చెందిన దలరామ్ (25) అనే వ్యక్తి గత కొంత కాలంగా బాబుల్‌రెడ్డి నగర్‌లో ఉంటున్నాడు.దలరామ్ రాజస్థాన్ నుంచి బాబుల్‌రెడ్డి నగర్‌కు బొలిరో వాహనంలో నిషేధిత పధారాలను తీసుకువచ్చి బాబుల్‌రెడ్డి నగర్‌లోని గుట్కాలు తయారు చేసే ఫ్యాక్టరీతో పాటు పలువురు వినియోగదారులకు,నగరంలోని పలు గుట్కా ఫ్యాక్టరీలకు విక్రయిస్తున్నాడు.నింధితుడు దలరామ్ వద్ద నుంచి 37 కేజీల నిషేధిత పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.నింధితుడు దలరామ్ ఇచ్చిన సమాచారం మేరకు శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు,ఎక్సైజ్ టాస్క్ పోర్సు సిబ్బంది కలిసి బాబుల్‌రెడ్డినగర్‌లోని ఓ గోదాంపై దాడులు నిర్వహించారు..ఈ గోదాం నుంచి 1035 కేజీల నిషేధిత పదార్థాలనుఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అజర్ అనే వ్యక్తి గోదాంను నిర్వహిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.ఈ కేసులో ఒక వ్యక్తిని అరెస్ట్ చేయగా మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు.ఈ దాడుల్లో శంషాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ హరిప్రియ,అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్‌రెడ్డి,ఇన్‌స్పెక్టర్ దేవేందర్‌రావు,టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్‌తో పాటు పలువురు ఎస్ఐలు,సిబ్బంది పాల్గొన్నారు.



నింధితుడి వద్ద నుంచి శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు నల్ల మందు స్వాధీనం చేసుకున్న దృశ్యం

## మేయర్ ఇంట్లోకి చొరబడ్డ మతిస్థిమితం లేని వ్యక్తి

**-పోలీసుల అదుపులో నిందితుడు**



**హైదరాబాద్, మే02, ప్రభాతవార్త:**
గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల విజయలక్ష్మి ఇంట్లోకి ప్రవేశించిన మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్ చేశాడు. వివరాల్లోకి వెళ్తే, బంజారా హిల్స్ ప్రాంతంలోని మేయర్ నివాసంలోకి అకస్మాత్తుగా ప్రవేశించిన అపరిచిత వ్యక్తి, ఆమె సిబ్బందిని తోసుకుంటూ ఇంట్లోని ప్రవేశించి మేయర్ వ్యక్తిగత గదిలోకి వెళ్ళబోయాడు. అతడికి నేర చరిత్ర ఉందని, తన సమస్య గురించి మేయర్‌తో మాట్లాడి తీరాలనీ బెదిరించి, సెక్యూరిటీ సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. సంఘటన జరిగిన సమయంలో మేయర్ ఇంట్లో లేరు. ఆమె తండ్రి, రాజ్యసభ ఎంపీ కే.కేశవరావుకు శాస్త్ర చికిత్స జరిగిన కారణంగా ఆసుపత్రికి వెళ్ళడంతో అక్కడ కొంత సేపు అలజడి వాతావరణం నెలకొంది. మేయర్ సిబ్బంది ఫిర్యాదు మేరకు తాజాగా అతడిని పోలీసులు అరెస్ట్ చేయగా అతడి మానసిక పరిస్థితి సరిగ్గా లేదని వెల్లడైంది. అంతే కాకుండా ఆ వ్యక్తి యూసుఫ్‌గుడా ప్రాంతానికి చెందిన లక్ష్మణ్‌గా గుర్తించిన పోలీసులు, అతనిపై పలు రౌడీ షీట్‌లు దాఖలైనట్లు వెల్లడించారు.

## ఎన్నికల సమయంలో మార్ఫింగ్ మాయ

**-సైబర్ నేరాల్లో మరో కోణం 'మార్ఫింగ్'**
**-సామాజిక మాధ్యమాలపై పోలీసుల నిఘా**
**-పొలిటికల్ లీడర్ల మార్ఫింగ్ పై చర్యలు**
**-నకిలీ వార్తలు ప్రచారం చేస్తే అరెస్టు తప్పదు**
**-క్రియేటర్‌లకు ఐటీ యాక్ట్ కళ్ళెం**



**హైదరాబాద్, మే02, ప్రభాతవార్త:**
తెలంగాణలో మత ప్రాతిపదికన ముస్లింల కోటానూ, వారి రిజర్వేషన్లనూ రద్దు చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వాదిస్తున్నట్లుగా వచ్చిన మార్ఫ్‌డ్ వీడియో సంచలన రీతిలో చర్చనీయాంశమైన నేపథ్యంలో, రాజకీయంగా ఎటువంటి అనర్థాలూ జరగకుండా పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా అంతర్జాలంలో సమస్త సామాజిక మాధ్యమాలపై పోలీసుల నిఘాని పటిష్టం చేసింది. అమిత్‌షా కేసుని విచారిస్తున్న డిల్లీ పోలీసుల బృందం తెలంగాణలో కూడా ఉండడంతో, ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ ఐటీ సెల్‌కు చెందిన సభ్యులను గురువారం నగర సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అంతే కాకుండా ఎక్స్‌లో మార్ఫ్ చేయబడిన నకిలీ వీడియోలు పోస్ట్ చేశారనే ఆరోపణలపై వివిధ ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురితో పాటూ దేశ వ్యాప్తంగా పది మంది కాంగ్రెస్ నాయకులకు సమన్లు అందజేశారు. వారిలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు శివకుమార్ అంబాల, ఆస్మా తస్లీమ్, సతీష్ మన్నే, నవీన్ పట్టెం తదితరులకు సీఆర్‌పీసీ సెక్షన్ కింద సమన్లు ఝారీ చేశారు. కాగా టీపీసీసీ సభ్యుల తరఫు న్యాయవాది బుధవారం డిల్లీ పోలీసుల ముందు హాజరై, అమిత్‌షా ఫేక్ వీడియోకీ, తమ నాయకుడికీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆ వీడియో సృష్టికర్తను గుర్తించడానికి తాము కూడా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**వీడియోలను వైరల్ చేస్తే కఠిన చర్యలు తప్పవు:**

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులూ, వీవీఐపీల బహిరంగ సభలకు సంబంధించి ఎలాంటి ఫేక్ వీడియోలూ, ఫొటోలూ, నకిలీ వార్తలూ వైరల్ అయినా సరే తక్షణమే 'స్మాష్' (సోషల్ మీడియా యాక్షన్ స్క్వాడ్) ద్వారా వాటిని సృష్టించిన సృజనాత్మక సృష్టికర్తలను(క్రియేటర్) గుర్తించే విధంగా పోలీసులు నిఘాని పటిష్టం చేసినట్లు తెలుస్తోంది. అందుకోసమే ప్రత్యేకంగా సోషల్ మీడియా మానిటరింగ్ యూనిట్ (ఎస్ఎమ్ఎమ్‌యూ)ను అధికారికంగా ఏర్పాటు చేశారు. ఈ మేరకు బంజారా హిల్స్ ప్రాంతంలో కమాండ్ ఎండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేక బృందాలు, ఇంటిగ్రేటెడ్ సోషల్ మీడియా సర్వైలెన్స్ వింగ్ సభ్యులూ స్మాష్ ఆధ్వర్యంలో అంతర్జాలంలో గల సామాజిక మాధ్యమాలన్నిటినీ పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా నగరంలోని అన్ని సామాజిక గ్రూప్‌లతో పాటూ, ఓల్డ్ సిటీకి చెందిన అన్ని సోషల్ మీడియా గ్రూప్‌లపై నిఘా పెంచారు. ఇప్పటికే రాజకీయ పార్టీల పోటాపోటీ ప్రచారాలూ, సభలూ, సమావేశాలకు చెందిన ప్రతీ సమాచారాన్నీ సేఖరించి, రెచ్చగొట్టే విధంగా ఉన్న వీడియోలనూ, ఫొటోలనూ పరిశీలిస్తున్నారు. వాటిని మార్ఫింగ్ చేశారా, లేదా నిజమైనవేనా అనేది ప్రతీ చిన్న వివరాలనూ కూడా వదలకుండా గమనిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల ట్విట్టర్(ఎక్స్), వాట్సాప్, ఫేస్‌బుక్,ఇన్స్‌టాగ్రామ్, యూట్యూబ్ తదితర ఖాతాలపై పెట్టిన నిఘాలో భాగంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, ఎలాంటి పోస్టింగ్ చేసినా పోలీసులు అప్రమత్తమై గమనిస్తున్నారు. పోలింగ్ డే దగ్గర పడుతుండడంతో ఫేక్ అకౌంట్ల ద్వారా పోస్టింగ్ చేసేవారిని ట్రేస్ చేస్తున్నారు. తప్పుడు ప్రచారాలు చేసేవారిని ఫోన్ నెంబర్లు, ఐపీ అడ్రస్ మాత్రమే కాకుండా వారి పరికరాల ద్వారా, అవి ఉన్న స్థానం ద్వారా పోలీసులు గుర్తిస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా మార్ఫింగ్ వీడియోలూ, ఫొటోలూ, నకిలీ వార్తలూ సృష్టించి వాటిని వైరల్ చేస్తూ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే ఏ క్రియేటర్‌నూ ఉపేక్షించేది లేదని తక్షణ చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

## 6న "ఏకలవ్య ఆత్మగౌరవ సమ్మేళన సభ"

### -తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం



సభపోస్టర్ ఆవిష్కరిస్తున్న కుతాడి కుమార్, రఘు, శేఖర్, శ్యామల

**హైదరాబాద్,ఏప్రిల్ 2,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఈనెల 6న మేడ్చల్ జిల్లాలోని యాప్రాల్‌లో ఏకలవ్య ఆత్మగౌరవ సమ్మేళన సభ నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుతాడి కుమార్ తెలిపారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎరుకల సామాజిక వర్గ అభివృద్ధికోసం ఏకలవ్య కార్పొరేషన్,ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అదేవిధంగా అనేక ఏళ్లుగా కాంగ్రెస్‌పార్టీ లో పనిచేస్తున్న నాయకులను గుర్తించి వెంటనే జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు బి.రఘు, సిరిమతి శేఖర్,పిట్టలింగయ్య, కండెల వెంకటేష్, పి.సమ్మయ్య, కార్తీక్, శ్రీహరి, మహిళా అధ్యక్షురాలు శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి

### -డిసికి ఎంహెచ్ఆర్ కాలనీ వాసులు వినతి



డిసికి వినతి పత్రం అందిస్తున్న కాలనీ వాసులు

**అల్వాల్, మే 2 ప్రభాతవార్త:** సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంహెచ్ఆర్ కాలనీ వాసులు డిసికి వినతి పత్రం అందించారు. గురువారం అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో డిసి శ్రీనివాస్ రెడ్డిని కాలనీ వాసులు కలిశారు. పార్కు అభివృద్ధి, వీది దీపాలు సమస్యలను డిసికి తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే సమస్యలు అన్నింటిని పరిష్కరిస్తామని డిసి వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సంతోష్ రెడ్డి ఉపాధ్యక్షుడు సుధీర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జీవన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించాలి



నృత్యకళాకారులను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, మే 2 ప్రభాతవార్త:** మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించాలనే సంకల్పంతో ముందుకు సాగాలని గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డు గ్రహీత సరళకుమారి అన్నారు. సాలభంజిక స్టూడియో ఫర్ ఆర్ట్స్ అండ్ పెర్ఫార్మెన్స్ ఆధ్వర్యంలో గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగిన నృత్యోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ డాక్టర్ పట్టాథిల్ ధన్యమీనన్ ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సరళకుమారి మాట్లాడుతూ నృత్య సంస్థ కొన్ని సంవత్సరాల పాటు ఒక మహిళ నిర్వహించడం అంత సులువైన విషయం కాదని, కేరళ రాష్ట్రంలోనే కాకుండా హైదరాబాద్‌లో కూడా సాలభంజిక శాఖలను స్థాపించి నిర్వహించడం అభినందనీయమన్నారు. పంచాక్షరీ, దశావతారాలు, మండూక శబ్దం, అన్నమాచార్య కీర్తనలు, తరంగం, తిల్లాన నృత్యాలను చిన్నారులు అద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాట్యగురువులు గంటా పద్మజ లంకేష్, కోన జానకీ మోహన్‌రావు, బద్దర రావు, డాక్టర్ అరవ ఆంజనేయులు, ఎ.నాగేశ్వరరావు, సేవాతపస్వీ పద్మజ, తదితరులను సత్కరించారు. ప్రముఖ నటి రాగిణి, అన్నమాచార్య లిటరేచర్ పరిశోధకులు గంధం బసవ శంకరరావు, ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ అధినేత్రి పాలపర్తి సంధ్యారాణి, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, నిర్వాహక సంస్థ సభ్యులు దీప పట్టాథిల్, కళావాచస్పతి రమావాణి సుందరి తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### -డిప్యూటీ కమిషనర్ రవి కుమార్



**అత్తాపూర్ ఏప్రిల్2,ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటి కమిషనర్ రవి కుమార్ పేర్కొన్నారు.గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని జిహెచ్ఎంసి కార్యాలయంలో కార్మికులు, సూపర్‌వైజర్‌లకు చెత్త సేకరణ సంచులను డిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డిసి మాట్లాడుతూ...చెత్తను రోడ్డుపై పడేయకుండా, నేరుగా టిప్పర్‌లో లోడ్ చేయకుండా కార్మికులకు చెత్త సేకరణ కోసం చెత్త సంచులను పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు.రాజేంద్రనగర్ సర్కిల్‌ని చెత్త రహీత మండలంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు.

### విద్యార్థులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్ళడమే తమ లక్ష్యం



**చిక్కడపల్లి, మే 2 ప్రభాతవార్త:** విద్యార్థులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్ళడమే తమ పాఠశాల ధ్యేయమని కాకతీయ హైస్కూల్ అధినేత గోకా నవీన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పది పరీక్షల్లో రామ్‌నగర్‌లోని కాకతీయ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభచాటారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గోకా నవీన్, ప్రిన్సిపాల్ రామరాజు బల్వంతరావు సత్కరించారు. పది జీపీఏ సాధించిన టి.హరిప్రియ, తొమ్మిది.ఎనిమిది, తొమ్మిది.ఏడు సాధించి మొదటి స్థానంలో నిలిచిన జీపీఏ సాధించిన కె.భువనేశ్వర్ వారిని సత్కరించారు. విద్యార్థులకు అత్యుత్తమ ఉపాధ్యాయుల ద్వారా విద్యనందించడం ద్వారానే ఈ ఫలితాలు వచ్చాయన్నారు.

## దళిత బహుజనుల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

### -మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య



సమావవేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య తదితరులు

**హైదరాబాద్,మే1, ప్రభాతవార్త:** దళితుల అభ్యున్నతి, సాధికారత కోసం గతంలో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో కృషి చేసిందని ప్రస్తుతం రాష్ట్రంతో పాటు దేశంలో అధికారంలో ఉంటే దళిత బలహీనవర్గాలకు మరింత మేలు జరిగే అవకాశం ఉందని అందుకు కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య పేర్కొన్నారు. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మన్నె శ్రీధర్‌రావులతో కలిసి చెన్నయ్య మాట్లాడారు. గతంలో ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం తెచ్చి చట్టబద్ధత చేయడం, ఆహార భద్రతా చట్టం, భూపంపిణీ బ్యాంకుల జాతీయకరణ పబ్లిక్ రంగ సంస్థల ఏర్పాటు ఇలాంటి చట్టాల ద్వారా దళిత గిరిజన, బలహీనవర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ పాటుపడిందని తెలిపారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి కేవలం కార్పొరేట్ శక్తులకే కొమ్ము కాస్తు వారికి దేశ సంపదను దోచి పెడుతుందని విమర్శించారు. బిజెపి మళ్ళీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చివేసి ,ఎస్సీ,ఎస్టీ బిసిల రిజర్వేషన్లు తొలగించే ప్రమాదం ఉందని తెలిపారు. టిఆర్ఎస్ పదేళ్లపాలనలో దళితులను కెసిఆర్ వంచించారని దళితబంధు మూడెకరాల భూమి లాంటి వాటితో మోసం చేశారని మండిపడ్డారు. దళితబహుజనులు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని చెన్నయ్య పిలుపునిచ్చారు. ఈసమావేశంలో మాల మహానాడు గ్రేటర్ అధ్యక్షులు బైండ్ల శ్రీనివాస్, నాయకులు కనకలం ఎల్లస్వామి, చేపూరి శంకర్, కమల్‌కుమార్, ఒగ్గు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి ఎన్నికల్లో బిజెపిని ఓడించి దేశాన్ని కాపాడాలి

### -బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్



ప్రెస్‌క్లబ్‌లో అభివాదం చేస్తున్న నరేందర్‌గౌడ్,రామారావుగౌడ్, రామకృష్ణ, శ్రీనవాస్ యాదవ్ తదితరులు

**హైదరాబాద్, మే 2,ప్రభాతవార్త:** వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని ఓడించి దేశాన్ని కాపాడాలని తెలంగాణ బిసి సంక్షేమసంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు గిరిగాని క్రాంతి ఆధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పార్లమెంట్ ఉబయ సమావేశాల్లో కులగణన చేయమని అడిగితే పార్లమెంట్ సాక్షిగా వ్యతిరేకించిన విషయాన్ని ఈసందర్భంగా గుర్తుచేశారు. బిసికులగణన సాధన కోసం రాహుల్‌గాంధీ దేశమంతా పర్యటిస్తున్నారని కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బిసిల కులగణన సాధ్యమవుతుందన్నారు. బిసి కులగణన రాహుల్ గాంధీ జీవిత లక్ష్యం అన్నారు. సికింద్రాబాద్ ఎంపిగా దానం నాగేందర్‌ను గెలిపించాలని ఈసందర్భంగా పిలుపునిచ్చారు. మోడీ పదేండ్ల పాలనలో బిసిలకు ఒరిగిందేమీ లేదని దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణన అడ్డుకున్నది మోడీనేనని నరేందర్‌గౌడ్ దుయ్యబట్టారు. ఈకార్యక్రమంలో బిసి యునైటెడ్ ఫ్రంట్ వ్యవస్థాపకులు పాలూరి రామకృష్ణ, బిసి న్యాయవాదుల ఫోరం అధ్యక్షులు నాగుల శ్రీనివాస్, జైగౌడ జాతీయ అధ్యక్షులు వట్టికూటి రామారావుగౌడ్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి మాలి సత్యంగౌడ్, పిసిసి గీత సెల్ ఉపాధ్యక్షులు రేవతి గౌడ్, మహిళా జేఏసీ చైర్‌పర్సన్ జయంతిగౌడ్, ఆల్ ఇండియా యాదవ్ మహాసభ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్ ,బెక్కం వెంకట్ , మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై దృష్టిని కేంద్రీకరించాలి

### -సీసీఎంబి డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు



ప్రసంగిస్తున్న సీసీఎంబి డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు

**హైదరాబాద్, మే 2 ప్రభాతవార్త:** ప్రస్తుతం ఉన్న తరుణంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యత పెరిగిపోయిందని, దీనిపై దృష్టిని కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని సీసీఎంబి డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు అన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో గురువారం అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, అవంతి ఫార్మసీ(గుంతపల్లి) సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు శాస్త్రీయ పద్ధతులు-శాస్త్రాలలో కొనసాగుతున్న ఇటీవలి పోకడలతో జ్ఞానోదయం'అంశంపై జాతీయ సెమినార్ బయో-అధ్యాయన్-2కె24 జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ మోహన్‌రావు మాట్లాడుతూ జీవశాస్త్ర వైవిధ్యంపై మెళకువలు తెలుసుకోవాలన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన లీడ్స్ ఫార్మ సిఎండి డాక్టర్ బి.ప్రభాశంకర్ మాట్లాడుతూ నేడు ఫార్మసిస్టుల పాత్ర ఎంతో ఉందని అన్నారు. శ్రీనివాస లాబోరేటరీస్ డైరెక్టర్ డాక్టర్ వీరారెడ్డి 'మోడ్రన్ ట్రెండ్స్ ఇన్ అనాలిసిస్ అండ్ సింథసిస్' అంశంపై ప్రసంగించా పరిశోధన శాస్త్రవేత్త రాజేందర్ తన ప్రసంగంలో పార్మాసియోటికల్స్ అండ్ ఇంపార్టెంట్ నావెల్ మెటబాలిక్స్-ఉత్పత్తి కోసం బయోటెక్నాలజీ ఇంటర్వెన్షన్ అంశంపై ప్రసంగించారు. ఎన్ఐఎన్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ ఎస్‌వైహెచ్.ఖాద్రీ ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరై పోషకాహార లోపంపై సైన్స్, కొనసాగుతున్న పరిశోధనల ఉద్దేశంపై ప్రసంగించారు. సిసిఎంబి సీఓఓ-ఎఐసి డాక్టర్ రామ్‌జజీ పావెలా తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ స్వాగతం పలుకగా అవంతి గ్రూప్ ఆఫ్ ఇన్సిటీట్యూషన్స్ డైరెక్టర్(హెచ్ఆర్) జయప్రద ప్రసంగించారు.

### ఉత్తమ విద్యాబోధన, క్రమశిక్షణతో మంచి ఫలితాలు

**చిక్కడపల్లి, మే 2 ప్రభాతవార్త:** ఉత్తమ విద్యాబోధన, క్రమశిక్షణ, నాణ్యమైన విద్యను అందించడం వల్లనే మంచి ఎస్ఎస్‌సి ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందని చిక్కడపల్లి సెయింట్ ఆడమ్స్ విద్యాసంస్థ అధినేత డాక్టర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ విద్యార్థులను మంగళవారం డాక్టర్ శ్రావణ్‌కుమార్ సత్కరించి అభినందించారు. మొత్తంగా ఈ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని అన్నారు. మొత్తం 23 మంది పరీక్షలను రాయగా 100శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందని, 9.8 ఒకరు, 9.7 ముగ్గురికి, మరో తొమ్మిదికి 9 గ్రేడ్ సాధించారన్నారు.

## దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి అనుకూల పవనాలు

### -రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు



నైషదం సత్యనారాయణమూర్తిని సత్కరిస్తున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు

**చిక్కడపల్లి, మే 2 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి మోదీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కూటమికి అనుకూల పవనాలు వీస్తున్నాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, ఆర్థిక శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి నాయకత్వంలో బాగ్‌లింగంపల్లికి చెందిన బ్రాహ్మణ సామాజిక వర్గంకు చెందిన నైషదం సత్యనారాయణమూర్తి మంత్రి శ్రీదర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి మంత్రి ఆహ్వానించి ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీలో వివిధ పార్టీల నుంచి చేరిన వారందరికి సముచిత స్థానం కల్పిస్తామని హామీఇచ్చారు. నైషదం సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, పేద ప్రజల కోస కాంగ్రెస్ పార్టీచేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి చేరడం జరిగిందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపుకోసం తను కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు తులసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### దేశంలో వాణిజ్యరంగంలో రాణించడానికి ఇదే మంచి సమయం

#### -ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ విభాగం డాక్టర్ ఇంద్రకంటి శేఖర్



ప్రసంగిస్తున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ విభాగం,

**చిక్కడపల్లి, మే 2 ప్రభాతవార్త:** ప్రస్తుతం దేశంలో వాణిజ్యరంగంలో ఎన్నో అవకాశాలు వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవాల్సిన బాధ్యత విద్యార్థినీ విద్యార్థులపైనే ఉందని ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ విభాగం, శిక్షణ, ప్లేస్‌మెంట్ ఫెసిలిటేషన్ ఇంచార్జ్ డాక్టర్ ఇంద్రకంటి శేఖర్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఇంటి ఆస్తి నుంచి జీతం ఆదాయం' అంశంపై నిర్వహించిన సదస్సుకు డాక్టర్ ఇంద్రకంటి శేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆదాయపన్ను, ఆదాయాలను ఎలా సమకూర్చుకోవాలి అంశంపై అనేక సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎన్.రిషికాంత్, ప్రిన్సిపాల్ మట్టా శేఖర్, విభాగాధిపతతి అన్నపూర్ణ, వైస్‌ప్రిన్సిపల్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. వాణిజ్యరంగంలో సమకాలీన అంశాలను ప్రస్తావిస్తూ అభివృద్ధికి ఆదాయం ఎలా సమకూరుతుందో వివిధ అంశాలను ప్రస్తావించారు. విద్యార్థులు, విద్య, ఉద్యోగ, రంగాలలో ఎలా రాణించాలో వివరించారు.

## ఫోన్‌ను చోరీ చేసి బ్యాంక్ ఖాతాకి కన్నమేశారు

### -అటోలో వచ్చారు....ఫోను దొంగిలించారు.
### -బ్యాంక్ ఖాతానుంచి నగదు కాజేశారు.
### -ఖాఖీలకు చిక్కారు.



**హైదరాబాద్, మే2, ప్రభాతవార్త:** ఇరుకు ఆటోలో సామాన్యుల్లా వచ్చిన నలుగురు సభ్యుల ముఠా తోటి ప్రయాణికుడి సెల్‌ఫోన్‌ను దొంగిలించి, అటుపై అతడి బ్యాంక్ అకౌంట్ నుంచి నగదు తస్కరించిన వైనం ఓల్డ్ సిటీ ప్రాంతంలోని మినార్ గార్డెన్ ఫంక్షన్ హాల్ వద్ద చోటు చేసుకుంది. ఆటో డ్రైవర్ పథకం ప్రకారం ఈ దొంగతనం జరిగినట్లు తెలిసింది. మీర్‌చౌక్ పోలీసులు బుధవారం రాత్రి 11:00 గంటల సమయంలో నిందితులను కనిపెట్టి అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ ఎప్. నరసింహ తెలిపిన వివరాల ప్రకారం, కొత్తగూడానికి చెందిన వ్యాపారి మహమ్మద్ అబ్దుల్ జలీల్ గత నెలలో పనిమీద నగరానికి వచ్చి స్వస్థలానికి తిరుగు ప్రయాణమవుతున్న నేపథ్యంలో తన ఆటోలో తన చారవాణిని పోగొట్టుకున్నాడు. ఇమ్లీబన్ బస్‌స్టాండ్‌కు వెళ్ళడానికి నయాపూల్ క్రాస్‌రోడ్డు వద్ద నిలబడిన మొహమ్మద్ అబ్దుల్ జలీల్ వద్దకు నలుగురు ముగ్గురు ప్రయాణికులు గల ఆటో వచ్చింది. తొలుత అయిష్టంగానే ఆటోలో కూర్చున్న బాధితుడు, తాను రూ.80 చెల్లించి కూడా ఇరుక్కుని కూర్చోవాలా అంటూ అసహనాన్ని వ్యక్తం చేశాడు. దాంతో రోడ్డు పక్కకు అటోను ఆపిన డ్రైవర్, తన పక్కన కూర్చున్న ప్రయాణికుడిని వెనుకకు వెళ్ళమని, అసహనంతో ఉన్న జలీల్‌ను ముందుకు రమ్మన్నాడు. డ్రైవర్ చెప్పినట్లే సర్దుకుని కూర్చున్న బాధితుడు జలీల్ తన జేబులు తడిమి చూసుకుని తన సెల్‌ఫోన్ మాయమైందని గ్రహించాడు. ఆటోలో ఉన్న మిగతా వ్యక్తులే గుట్టు చప్పుడు కాకుండా ఈ చోరీ చేశారని గుర్తించిన బాధితుడు, వారంతా ఒకే ముఠా అని తెలుసుకుని భయాందోళనకు లోనై మధ్యలోనే ఆటో దిగిపోయాడు. అనంతరం వేరే సెవెన్ సీటర్ ఆటోలో బస్‌స్టాండ్‌కు చేరుకుని తన స్వస్థలానికి వెళ్ళిపోయాడు. అనంతరం తన నెంబరుని బ్లాక్ చేయించి అదే నెంబరుతో కొత్త సిమ్ కార్డు తీసుకున్న బాధితుడు, తన బ్యాంకు ఖాతా నుండి రూ.20,000 తన ప్రమేయం లేకుండా యుపీఐ ట్రాన్సాక్షన్ ద్వారా బదిలీ చేయబడిందని గుర్తించాడు. దాంతో అతడు నగర పోలీసులను ఆశ్రయించి దొంగతనం జరిగిన వివరాలతో పాటూ అనుమానితుల వివరాలు తెలియజేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా ఆటోని ట్రేస్ చేసి నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులని చోటాఖాజా ఊరఫ్ అబ్దుల్ ఖాజా (30), మొహమ్మద్ ఇంతియాజ్(24), మొహమద్ నవాజ్(25), గులామ్ హాసన్(23) ఊరఫ్ చాక్లెట్ హాసన్‌లుగా పోలీసులు గుర్తించారు. గతంలో వీరు నలుగురూ పదుల సంఖ్యలోని కేసులలో ముద్దాయిలుగా ఉన్నట్లు తెలిపారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లనీ, ఒక ఆటోనీ స్వాధీనం చేసుకున్న పోలీసులు బాధితుడి నుంచి కాజేసిన నగదును రికవరీ చేసే కోణంలో విచారణ చేపట్టారు.

## సార్వత్రికల నేపథ్యంలో ఫ్లాగ్‌మార్చ్

### -ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి : ఎసిపి శ్రీనివాస్




**అత్తాపూర్ మే2,ప్రభాతవార్త :** సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎసిపి శ్రీనివాస్ పేర్కొన్నారు.గురువారం రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హసన్ నగర్ ప్రాంతంలో సిఐఎస్ఎఫ్,టిఎస్ఎస్‌పి ఫోర్స్,రాజేంద్రనగర్ డివిజన్ సిబ్బంది,పోలిసు సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలు పార్లమెంట్ ఎన్నికలపై అవగాహన కల్పించారు.ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రశాంతవాతరణంలో జరిగేలా సహకరించాలని కోరారు.ఎవ్వరైన అవంఛానియ ఘటనలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కుపై అవగాహన ఉండాలని అందరూ స్వచ్ఛందంగా ఓటును వినియోగించుకొని పోలిసు సిబ్బందికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రన్ ఇన్స్‌పెక్టర్,అత్తాపూర్ ఇన్స్‌పెక్టర్ వెంకట్రామ్ రెడ్డి ,రాజేంద్రనగర్ పిఎస్ డిట్రాక్టివ్ ఇన్స్‌పెక్టర్,ఎస్‌లు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



## హబీబ్ నగర్‌లో పంబ్లర్ హత్య

### -తాగిన మైకంలో దాడి చేసిన బంధువులు

**హైదరాబాద్, మే02, ప్రభాతవార్త:** సొంత వాళ్ళ చేతిలో ఒక వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన హబీబ్ నగర్‌లో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, మాసబ్ ట్యాంక్ ప్రాంతంలో పంబ్లర్‌గా పని చేసే అయూబ్(39) మద్యం మత్తులో అతడి మామ, బావమరిదిలు దాడి చేసి కొట్టి చంపారు. తాగిన మైకంలో పడిన వాగ్వివాదం చిలికి చిలికి గొడవగా మారడంతో అయూబ్ మామయ్య మొహినుద్దీన్, బావమరిది బాబా స్పృహ తప్పేలా దాడి చేశారు. ఈ ఘటన మల్లేపల్లి ప్రాంతం జియాన్ అపార్ట్‌మెంట్‌లో చోటు చేసుకోగా, స్థానికులు జరిగిన గొడను గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుడు అయూబ్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అయూబ్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు.

### మల్కాజ్‌గిరి పార్లమెంట్‌లో 22మంది అభ్యర్థులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 2, ప్రభాతవార్త** మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానానికి 22మంది అభ్యర్థులు బరిలో ఉండటంతో అదనంగ బ్యాలెట్ యూనిట్స్ సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశామని మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి,కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియలతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి మల్కాజ్‌గిరి జిల్లాలో మొదటి ర్యాండమైజేషన్‌లో 3029బ్యాలెట్ యూనిట్లను కేటాయించటం జరుగగా, నామినేషన్ల ప్రక్రియ అనంతరం 22మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున అదనంగ బ్యాలెట్ యూనిట్లు యంత్రాల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించటం జరిగిందన్నారు. ఈ సందర్భంగ ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగ ఈవిఎం యంత్రాల సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టామన్నారు.

## కాంగ్రెస్‌వీ మోసపూరిత వాగ్దానాలు

### - విలేకరుల సమావేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, తదితరులు

**షాద్‌నగర్, మే 2, (ప్రభాతవార్త) :** అబద్ధాపు హామీలు, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు మూడు నెలలకే చీదరించుకుంటున్నారని పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ ఇంఛార్జీ దుదీమెట్ల బాల్‌రాజ్ కాంగ్రెస్ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో మాజీఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ ఇంఛార్జీ బాల్‌రాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అని, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం ప్రాణత్యాగానికి సహితం సిద్దపడిన కేసీఆర్‌ని విమర్శించే అర్హత లేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజలకు కాంగ్రెస్ మోసపూరిత వైఖరి స్పష్టమైందని, అందుకే ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితి లేదని అన్నారు. 13 అంశాలతో 6 గ్యారంటీల స్కీమ్ తీసుకువచ్చి ప్రజలను నిలువున మోసం చేశారని ఆయన విమర్శించారు. రైతన్నలకు ఇచ్చిన హామీలు ఎక్కడి పోయాయని ఆయన ప్రశ్నించారు. పంటకు 500 బోనస్, కౌలు రైతులకు 12వేల రూపాయలు ఎందుకు ఇవ్వాడం లేదని ఆయన కాంగ్రెస్ పార్టీని నిలదీశారు. రాష్ట్రంలో, దేశంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిస్తేనే వారు 6 గ్యారంటీలు అమలు చేస్తారని లేదాంటే అంతే అని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తే నేడు రేవంత్‌రెడ్డిని వాటిని నిలిపివేశారని అన్నారు. కళ్యాణలక్ష్మీ, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నిలిపి పేద ప్రజల జీవితాలతో చలగాటం ఆడుతున్నాడని మండిపడ్డారు.

IN THE COURT OF THE HON'BLE JUDICIAL MAGISTRATE OF FIRST CLASS-SPECIAL (PCR ACT) RANGA REDDY-cum-IV ADDITIONAL METROPOLITAN MAGISTRATE-cum-IV JUNIOR CIVIL JUDGE; RANGA REDDY COURT, AT L B NAGAR
O.S. NO. 290 OF 2024
BETWEEN:-
Rachuri Prameela and 3 Others ...PLAINTIFFS
AND
Sarroor Nagar Tahsildhar and Another ...DEFENDANTS
NOTICE/SUMMONS
To,
ALL CONCERNED ...RESPONDENT No.2
Please take Notice/Summon that the above named Plaintiffs have filed the above Referred SUIT for DECLARATION to declare that the Plaintiffs are the legal heirs of the Late Sri. RACHURI HANUMANTH RAO in whose favour the Suit Schedule Property is registered and the same is posted on **04-06-2024** for appearance of Respondents.
Notice is hereby given to All Concern that the said Suit is posted on **04-06-2024**, for appearance of the persons objecting the Petition claim of the Petitioner's. Hence the said persons having any interest shall appear either personally or through your Advocate on **10.30 AM on 04-06-2024**, if you failed to appear on that day the necessary orders will be passed in your absence.
//BY ORDER OF THE COURT//
HARI KRISHNA
SAI KUMAR THOTA
SAI KRISHNA, ADVOCATES.
TILAK NAGAR, NALLAKUNTA, HYD.
CELL : 9849753387

పబ్లిక్ నోటీస్
నా క్లైంట్ ఎం. సూర్య మోహన్ S/o. M. శేషయ్య, R/o C 309 ARK HOMES, Turkapally, Bolaram, సికింద్రాబాద్, భూమి పత్రము అమ్మకానికి సంబంధించిన వర్జినల్ "Agreement for sale of Land" Vide document No.10690/2003, Dt. 30.08.2003 మరియు "Deed of Sale" Vide document No. 6467/2006, dt. 24.04.2006 పోగొట్టుకున్నారని సామాన్య ప్రజలకు దీని ద్వారా తెలియజేస్తున్నాము. SRO Uppal, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, Plot No. 114/2/BKi సంబంధించి, సర్వేనెంబర్ 258 పార్ట్‌లో 2221.71 Sq.Mtrs., Phase II, I.D.A. చర్లపల్లి, ఘట్కేసర్ మండలం, మున్సిపల్/గ్రామ పంచాయతీ, APIIC- IALA, రంగారెడ్డి జిల్లా (ప్రస్తుతము మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా) వద్ద ఉన్నది, పై ఆస్తి M/S. REXER PHARMA PVT LTD మరియు APIIC LTD నా క్లైంట్ పేరుమీద ఉన్నది, తేదీ 22.04.2024 రోజున బోయిన్పల్లి నుండి చర్లపల్లికి ఆటోలో ప్రయాణిస్తుండగా తప్పిపోవటం జరిగినది, ఆ తరువాత ఈ తప్పిపోయిన డాక్యుమెంట్స్ ను కనుగొనడానికి చాలా ప్రయత్నం చేసినాడు కానీ పత్రాలు కనిపించలేదు.
కావున సాధారణ ప్రజానీకం ఇందు మూలముగా ఎవరికైనా/ఎవరైనా పైన పేర్కొన్న ఒరిజినల్ డాక్యుమెంట్స్ కనుగొన్నట్లయితే భూమి అమ్మకానికి సంబంధించిన ఒరిజినల్ పత్రము నెంబర్ 10690/2003 dt. 30.08.2003 మరియు "Deed of Sale" పత్రము నెంబర్ 6467/2006, dt. 24.04.2006 నమోదిత SRO ఉప్పల్, దానిని నా క్లైంటుకు లేదా క్రింద సంతకం చేసిన వారికి అప్పగించండి, పైన పేర్కొన్న అసలైన వాటిని ఎవరు/ఎవరైనా దుర్వినియోగము చేసినట్లయితే వారు భూ చట్టం ప్రకారము ప్రాసిక్యూషన్ చేయబడుతారు/ శిక్షించబడుతారు మరియు నా క్లైంటు ఒరిజినల్ డాక్యుమెంట్ ఎవరైనా దుర్మార్గులు చేసే లావాదేవీలకు బాధ్యత వహించరు మరియు నా క్లైంట్ కట్టుబడి ఉండరు అని నేను సాధారణంగా హెచ్చరిస్తున్నాను.
Sd/- శంకర్ గౌడ్ బుర్ర
అడ్వకేట్
అడ్రస్: H.No. 8-1/ 18 Road No.2, ప్రశాంత్ నగర్ కాలనీ, మేడిపల్లి (V)&(M), మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా-98,
Mobile : 9000602088

